www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
13 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 285

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## నల్గొండ జిల్లాలో సీఎం పర్యటన

# దామోదర్ రెడ్డి మరణం తీరని లోటు

- జిల్లాలో గోదావరి నీళ్లు ప్రవాహం
- క్రెడిట్ రాంరెడ్డి దామోదర్ రెడ్డిదే
- ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టుకు ఆర్‌డీఆర్
- మాజీ మంత్రి పేరును ఎస్సారెస్పీ 2
- 50 వేల మెజారిటీతో సామేల్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నల్గొండ జిల్లాలో గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నాయంటే దాని క్రెడిట్ రాంరెడ్డి దామోదర్ రెడ్డిదే నని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎస్సారెస్పీ2 ప్రాజెక్టుకు ఆర్‌డీఆర్ (మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి) మిగతా 2లో..



# మాటల యుద్ధం

## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

- సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్లు తెలిపారు
- బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీ అన్నారు
- ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయి
- సంజయ్ ఎక్కడ దాక్కున్నారు

## బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

యూపీఏ హయంలో చారిత్రాత్మక చట్టాలు అమల్లోకి వచ్చాయని చెప్పుకొచ్చారు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్. ఇదే సమయంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్టు తెలిపారు. బీజేపీ.. బీసీ వ్యతిరేక పార్టీ.. బీజేపీకి బీఆర్ఎస్ తోడైంది అంటూ ఘాటు విమర్శలు చేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ..'సోమవారం ఢిల్లీకి వెళ్తాం. సుప్రీంకోర్టు తలుపు తడుతాం. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలకు మేం భయపడం. బీసీ రిజర్వేషన్ల పెంపుపై మా చిత్తశుద్ధి ప్రజలకు తెలుసు. బీసీ రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టుకు వెళ్తాం. బీసీ రిజర్వేషన్ల పెంపుపై వెనక్కి తగ్గేది లేదు. బిల్లులు గవర్నర్ దగ్గర పెండింగులో ఉన్నాయి. ప్రధాని దగ్గరికి వెళ్ళి బీజేపీ నాయకులు ఎందుకు అడగడం లేదు?. బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిస్తే మద్దతు ఇస్తాం. బీసీ సంఘాలు ధర్నా చేసినప్పుడు ఈటల, సంజయ్ ఎక్కడ దాక్కున్నారు?. బీజేపీ నరనరాన బీసీ వ్యతిరేక పార్టీ. బీజేపీకి బీఆర్ఎస్ తోడైంది అంటూ విమర్శలు చేశారు.

**ఆర్టీఐపై కీలక వ్యాఖ్యలు..**

నేటితో ఆర్టీఐ చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్ళు అయిన సందర్భంగా స్పందిస్తూ.. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం, సోనియా గాంధీ దూరదృష్టి నాయకత్వంలో చారిత్రాత్మక సమాచార హక్కు చట్టం 2005 అక్టోబర్ 12న అమలులోకి వచ్చింది. దేశ చరిత్రలో ఆర్టీఐ చారిత్రాత్మక నిర్ణయం. ప్రజలకి వాస్తవాలను తెలుసుకోవడానికి మహత్తర అవకాశం ఆర్టీఐ ద్వారా కల్పించారు. ప్రజలకు ఆర్టీఐ జీవన రేఖగా మారింది. ఈ చట్టం ప్రజలకు ప్రభుత్వ విభాగాల సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చి పాలనలో పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానాన్ని తీసుకొచ్చింది. 2014 నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్టీఐకి తూట్లు పొడుస్తోంది. 2019 సవరణలతో సమాచారం కమిషన్ల స్వతంత్రతను బలహీనపరిచాయి. కమిషనర్ల పదవీకాలం మిగతా 2లో..



# కారు కావాలా.. బుల్డోజర్ కావాలా?

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక
- బీఆర్ఎస్ నాయకులు సమావేశం
- కాంగ్రెస్‌కి గుణపాఠం చెప్పాలి
- ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- ఓటుకు రూ. 10,000 ఇస్తారు
- బీజేపీ పనికిరాని పార్టీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్‌లో కొందరు నేతలు చేరారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సమక్షంలో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చెర్క మహేష్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

# పోరు ఆగదు

- బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యం
- బీసీ సంఘాలన్నీ జేఏసీగా
- బంద్ తాత్కాలికంగా వాయిదా
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు
- మద్దతు ఇవ్వాలని ఆర్ కృష్ణయ్య
- బీసీలకు తీవ్ర అన్యాయం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యం ఐక్యంగా పోరాడానికి బీసీ సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే అక్టోబర్ 14న తలపెట్టిన తెలంగాణ బంద్ కూడా తాత్కాలికంగా వాయిదా పడింది. వివరాలు... తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, బీజేపీ ఎంపీ ఆర్ కృష్ణయ్య అక్టోబర్ 14న తెలంగాణ వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు మద్దతు ఇవ్వాలని ఆర్ కృష్ణయ్య కోరారు. బీసీ రిజర్వేషన్లపై స్టే విధిస్తూ హైకోర్టు వెలువరించి నిర్ణయాన్ని విమర్శించారు. ఇది సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత స్టే విధించడం చరిత్రలో మొదటిసారి అని... ఇది బీసీలకు తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. అలాగే ఆర్ కృష్ణయ్యతో పాటు కొందరు బీసీ నాయకులు మిగతా 2లో..



# వెయ్యేండ్లు నిలిచేలా మేడారం అభివృద్ధి

**సమ్మక్క సారలమ్మ ఆలయం.. మంత్రి సీతక్క సందర్శించారు** 02

# ఘనంగా నారెడ్కో ప్రాపర్టీ షో

- నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో 2025
- ఘనంగా హైదరాబాద్ హైటెక్స్‌లో
- చివర రోజు ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- రియల్ ఎస్టేట్ వేగంగా అభివృద్ధి
- మోదీ నాయకత్వంలో అద్భుతాలు
- అభివృద్ధి చెందిన దేశంగా నిలవాలి





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ హైటెక్స్‌లో నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో 2025 ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వసతులు, ఆధునిక హంగులతో కూడిన అద్భుత హౌసింగ్ సదుపాయాలు ఈరోజు ప్రతి నగరంలో అందుబాటులోకి వస్తున్నాయి. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగం రియల్ ఎస్టేట్ సెక్టార్. ఈ రంగాన్ని బలోపేతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. హైదరాబాద్ నుండి బాంబే, నాగపూర్, విజయవాడ, బెంగళూరు — ఎక్కడికి వెళ్లినా ఇప్పుడు మిగతా 2లో..



# 16న రాష్ట్ర మంత్రిమండలి సమావేశం

- రాష్ట్ర మంత్రిమండలి 16న సమావేశం కానుంది
- ప్రతి 15 రోజులకు ఒకసారి
- గతంలో కేబినెట్ నిర్ణయించింది
- ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు
- ప్రాజెక్టుల అంచనాలు పెంచడం


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర మంత్రిమండలి ఈనెల 16న సమావేశంకానుంది. ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం నిర్వహించాలని గతంలో కేబినెట్ నిర్ణయించింది. అయితే వరదలు, బీసీ రిజర్వేషన్ల హడావిడి తదితర కారణాలతో కొంతకాలంగా ఈ సమావేశాలు జరగలేదు. కాగా ఈనెల 16న కేబినెట్ సమావేశం జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో ప్రధానంగా ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు ప్రారంభించడంపై చర్చించే అవకాశం ఉంది. దీనితో పాటు వివిధ ప్రాజెక్టుల మిగతా 2లో..

# తీరంలో విషాదం

## బాపట్ల జిల్లాలో విషాదం

- చీరాల మండలం వాడరేవు బీచ్
- ఐదుగురు విద్యార్థులు గల్లంతు
- సముద్రంలోకి కొట్టుకుపోయారు
- ముగ్గురు తెలంగాణ విద్యార్థులు
- ఆచూకీ కోసం పోలీసులు గాలింపు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బాపట్ల జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. చీరాల మండలం వాడరేవు బీచ్‌లో ఐదుగురు విద్యార్థులు గల్లంతయ్యారు. సముద్ర స్నానం కోసం వాడరేవు బీచ్‌కు వెళ్లిన ఐదుగురు విద్యార్థులు గల్లంతయ్యారు. నీటిలో మునిగి సముద్రంలోకి కొట్టుకుపోయారు. అనంతరం కొద్దిసేపటికి ముగ్గురు విద్యార్థుల మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయని తోటి విద్యార్థులు తెలిపారు. ఆ ముగ్గురు తెలంగాణకు చెందిన వారని సమాచారం. మరో ఇద్దరు విద్యార్థుల ఆచూకీ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. అమరావతిలోని విట్ యూనివర్సిటీకి చెందిన కొందరు విద్యార్థులు సెలవు రోజు కావడంతో బీచ్‌లో సరదాగా గడిపేందుకు వాడరేవు బీచ్‌కు వెళ్లారు. వారిలో సాత్విక్, సోమేష్, సాకేత్, మణిదీప్, గౌతమ్ అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. దీంతో ఆ ప్రాంతానికి చెందిన మిగతా 2లో..

# దామోదర్ రెడ్డి మరణం తీరని లోటు

(మొదటిపేజీ తరువాయి)

ఎస్సారెస్పీ 2గా నామకరణం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మాజీ మంత్రి పేరును ఎస్సారెస్పీ 2కు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 24 గంటల్లో జీవో జారీ చేస్తామన్నారు.

సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంస్మరణ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. 'రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణం తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు. ఆయన మరణం చాలా బాధాకరం, కానీ ఆయన జీవితం త్యాగానికి, నిబద్ధతకు, ప్రజాప్రేమకు నిలువెత్తు నిదర్శనం. ప్రజా జీవితంలో ఉన్నత స్థాయికి చేరినా.. ఆస్తుల కోసం కాదు, కార్యకర్తలు, పార్టీ కోసం పని చేశారు. నేటి కాలంలో ఒక్కసారి ప్రజా ప్రతినిధి అయినా కోట్లు కూడబెడతారు. కానీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి మాత్రం ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో వారసత్వంగా వచ్చిన వేలాది ఎకరాల భూములనూ త్యాగం చేశారు. ఆయన నిస్వార్థ రాజకీయానికి నిలువెత్తు నిదర్శనం. నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ జెండాను అగ్రస్థానంలో ఉంచారు. గోదావరి జలాలను ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు తీసుకురావడానికి ఆయన పోరాటం మరువలేనిది.



**ఎస్ఆర్ఎస్పీ ద్వారా గోదావరి జలాల పోరాటం...**

ఎస్ఆర్ఎస్పీ ద్వారా గోదావరి నీళ్లను నల్గొండ జిల్లాకు తెచ్చే ప్రయత్నంలో దామన్న వహించిన పాత్ర కీలకం. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 ప్రారంభానికి ఆయన ఎంతగానో కృషి చేశారు. సూర్యాపేట కేంద్రంగా పని చేసినా, తుంగతుర్తి నియోజకవర్గంలోని కార్యకర్తలకు దామన్న పెద్ద అండగా నిలిచారు. ఆయన సేవల ఫలితంగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ 50 వేల మెజారిటీతో గెలిచారు. ఆయనను "టైగర్ దామన్న"గా సంబోధించడం ఆయన త్యాగానికి, ధైర్యానికి ఇచ్చిన గుర్తింపు.

**కాంగ్రెస్‌తోనే చివరివరకూ జీవితం...**

రాంరెడ్డి దామోదర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై అమితమైన ప్రేమతో జీవించారు. చివరి శ్వాస కూడా కాంగ్రెస్ జెండాతోనే విడిచారు. జోడెద్దుల్లా రాంరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డి కలిసి కాంగ్రెస్ పార్టీని నల్గొండలో నిలబెట్టారు. రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణంపై సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తీవ్ర సంతాపం తెలియజేశారు. రాహుల్ గాంధీ స్వయంగా రాంరెడ్డి కుమారుడు సర్వోత్తంకు సంతాప లేఖ రాసి, భవిష్యత్తులో రాజకీయంగా కుటుంబానికి పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

**ఎస్సారెస్పీ 2కు దామోదర్ రెడ్డి పేరు...**

నల్గొండ జిల్లా కాంగ్రెస్ నేతల సూచన మేరకు ఎస్ఆర్ఎస్పీ స్టేజ్-2 ప్రాజెక్టుకు "ఆర్డీఆర్ ఎస్ఆర్ఎస్పీ" అని రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ నిర్ణయానికి సంబంధించి 24 గంటల్లో జీవో కూడా జారీ చేస్తాం. రాంరెడ్డి దామోదర్ రెడ్డి లాంటి నాయకులు రాజకీయాల్లో అరుదు. వారు చిరకాలం ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని రేవంత్ రెడ్డి అన్నారు.

## తీరంలో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

మత్స్యకారులు, గజ ఈతగాళ్లు వారిని కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోయింది. గల్లంతైన కాసేపటికి సాకేత్, సాత్విక్, మణిదీప్‌ల మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. సోమేష్, గౌతమ్‌ల ఆచూకీ కోసం వాడరేవు బీచులో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మచిలీపట్నం బందరు రూరల్ మండలం మంగినపూడి బీచ్ వద్ద నీళ్లలో కొట్టుకుపోతున్న నలుగురు యువకుల్ని పోలీసులు, మెరైన్ సిబ్బంది రక్షించారు. ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి వచ్చిన టూరిస్టులతో మంగినపూడి బీచ్ రద్దీతో కిటికీటలాడుతోంది. సముద్ర తీరా ప్రాంతంలో అలల తాకిడికి కృష్ణాజిల్లా కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన నలుగురు ముస్లిం యువకులు కొట్టుకుపోయారు. ఇది గమనించిన సబ్ ఇన్స్పెక్టర్ బోస్, మెరైన్ సిబ్బంది సాయంతో నలుగురు యువకుల్ని కాపాడారు. అబ్దుల్ అసిఫ్, ఎస్.కె అర్బాద్, ఎస్.కె సికిందర్ షరీఫ్, ఎండి అన్వర్, అనే యువకులను మెరైన్ సిబ్బంది ప్రాణాలకు తెగించి కాపాడారు. మెరైన్ పోలీసులు సకాలంలో స్పందించి తమ ప్రాణాలను కాపాడినందుకు యువకులు వారికి ధన్యవాదాలు తెలిపారు. యువకులను కాపాడడంలో మెరైన్ పోలీస్ సిబ్బంది చూపించిన ధైర్యసాహసాలను పర్యాటకులు ప్రశంసించారు.

## వెయ్యేండ్లు నిలిచేలా మేడారం అభివృద్ధి

- ములుగు జిల్లా తాడ్వాయి
- ప్రత్యేక పూజలు నిర్వహించారు
- జాతరకు లక్షలాది మంది భక్తులు
- గుడి నిర్మాణంలో ఆదివాసుల చరి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క సారలమ్మ ఆలయాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సమ్మక్క, సారలమ్మ తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. మేడారం అభివృద్ధి పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో, ఆ పనులు వేగంగా సాగి, రాబోయే మేడారం మహా జాతరకు ముందు పూర్తి అయ్యే విధంగా చూడాలని తల్లులను ప్రార్థించారు. జాతర సమయంలో లక్షలాది మంది భక్తులు విచ్చేసే ఈ ప్రాంతంలో సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తల్లుల దీవెనలతో మేడారం అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులకు ముక్కులు చెల్లించుకున్న అనంతరం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనుల కోసం సీఎం రేవంత్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. గద్దెల ప్రాంగణాన్ని విస్తరించి, అద్భుతంగా ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు ఎంత మెరుగైన దర్శనాన్ని, సదుపాయాలను కల్పించాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు. సీఎం ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. వారం క్రితమే మేడారం అభివృద్ధి పనులు మొదలయ్యాయి. జాతర రాకముందే పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుంటున్నారు" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

"సమ్మక్క సారలమ్మ దేవతల మీద రోజురోజుకూ భక్తుల విశ్వాసం పెరుగుతోంది. దీంతో భక్తులు పెద్ద ఎత్తున వస్తున్నారు. మేడారం మహా జాతర ఏర్పాట్లు ఇప్పటికే మొదలయ్యాయి. మేడారం పనులు శరవేగంగా సాగుతున్నాయి. భక్తులకు ఎక్కడ అసౌకర్యం కలగకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నాం. గుడి అభివృద్ధిలో నాకు భాగస్వామ్యం దక్కడం నా అదృష్టం. సీఎంతోపాటు, జిల్లా ఇంచార్జ్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎండోమెంట్ మినిస్టర్ కొండా సురేఖ, ట్రైబల్ మినిస్టర్ అడ్లూరి లక్ష్మణ్ కు ధన్యవాదాలు. ప్రతి దశలో పూజారులను సంప్రదిస్తూ పనులు కొనసాగిస్తున్నాం" అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

"గుడి నిర్మాణంలో ఆదివాసుల చరిత్ర, సమ్మక్క సారలమ్మ గోవిందరాజు పగిడిద్దరాజుల కుటుంబాల చరిత్ర, వారి త్యాగాలు, పూజారుల వంశ చరిత్ర ను భవిష్యత్తు తరాలకు అందించేలా అభివృద్ధి పనులు చేస్తున్నాం. ఈ జన్మకు ఇదో గొప్ప అవకాశంగా భావిస్తున్నాం. ఎవరెన్ని విమర్శలు చేసినా వెయ్యేండ్లు నిలిచేలా మేడారాన్ని అభివృద్ధి చేస్తాం. నాకు జన్మనిచ్చింది సమ్మక్క సమ్మయ్య. కానీ నాకు పునర్జన్మ ఇచ్చింది సమ్మక, సారలమ్మ, పగిడిద్ద గోవిందరాజులు. నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది. సమ్మక సారలమ్మ, ములుగు ప్రాంత ప్రజలు. కాబట్టి తల్లుల సేవలో ప్రజా సేవలో ఎల్లప్పుడు ఉంటాం. తల్లుల గొప్ప కీర్తిని కొంచెం కూడా తగ్గకుండా ముందుకు తీసుకెళ్తాం. ఈ చిన్న సమస్య లేకుండా గుడి నిర్మాణాన్ని పూర్తి చేస్తాం" అని మంత్రి సీతక్క తెలిపారు.

# ఘనంగా నారెడ్కో ప్రాపర్టీ షో

(మొదటిపేజీ తరువాయి)

అద్భుతమైన నేషనల్ హైవేలతో ప్రయాణం సులభమైందని అన్నారు.

నిజంగా చెప్పాలంటే, ఒకప్పుడు నేను అమెరికాకు వెళ్లినప్పుడు "మన దేశంలో ఎప్పుడు ఇలాంటి రహదారులు వస్తాయో?" అనుకునేవాడిని. కానీ ఇప్పుడు మోదీ నాయకత్వంలో రోడ్‌వేస్, ఎయిర్‌వేస్, రైల్వేస్, వాటర్‌వేస్ అన్నీ అత్యాధునిక స్థాయిలో రూపుదిద్దుకుంటున్నాయి. నరేంద్ర మోదీ నాయకత్వంలో అతి తక్కువ కాలంలోనే జాతీయ రహదారుల అభివృద్ధి అత్యంత వేగవంతంగా సాగుతోంది. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేస్ ద్వారా విజయవాడ, నాగపూర్ వంటి ప్రధాన నగరాలను అనుసంధానించే పనులు భూసేకరణ దశలో ఉన్నాయి. భూసేకరణ త్వరగా పూర్తయితే, ఈ ప్రాజెక్టులు త్వరలోనే వాస్తవ రూపం దాలుస్తాయి. మన లక్ష్యం స్పష్టంగా ఉంది, 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతాం. దేశం స్వాతంత్ర్యం పొందిన 100 సంవత్సరాలు పూర్తి చేసుకునే సమయానికి, ఎవరు ప్రధానిగా ఉన్నా, ఏ పార్టీ అధికారంలో ఉన్నా, అది ముఖ్యం కాదు. ముఖ్యం ఏమిటంటే, భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా నిలవాలి అన్నదే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం. ఈ దేశంలోని ప్రతి వృత్తివారు, ప్రతి పౌరుడు "2047 లక్ష్యం" గా పెట్టుకుని, అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ నిలవాలనే దిశగా కృషి చేయాలని ప్రధానమంత్రి ఎప్పటికప్పుడు పిలుపునిస్తుంటారు. నరేంద్ర మోదీ గ పాలనలో దేశంలో అన్ని రంగాల్లో అభివృద్ధి వేగవంతంగా జరుగుతోందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రతి మినిస్ట్రీలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరంగా వివిధ విధాలుగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈరోజు ఆర్థిక కార్యకలాపాలు మెరుగ్గా ఉన్నాయి, దేశంలో ఆర్థిక వృద్ధి పెరిగి ఉద్యోగాల, ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ కూడా కదలికలో ఉంది. మనదేశం ఇప్పటిదాకా ఫోర్త్‌లార్జెస్ట్ ఎకానమీగా ఎదిగింది, గతంలో బ్రిటన్ పరిపాలించగా భారతీయులను ఎలా నీచంగా చూడడానికి ప్రయత్నించినదాని చరిత్ర మనం గుర్తు పెట్టుకోవాలి. అటువంటి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అధిగమించగలిగిన దేశం ఇప్పుడిప్పుడు మన ముందే నిలిచింది. కాబట్టి మనం వెనక్కి తిరగకుండా, ముందుకు సాగుతూనే ఉండాలి. ఇదే నేపథ్యంలోనే నేను ఈ విషయాన్ని చెప్పుతున్నాను. అంతేకాక, త్వరలోనే మనం ఇంకా పెద్ద ఆర్థిక స్థాయికి చేరుకోవాలని ప్రధాని తరచుగా గుర్తు చేస్తుంటారు.



ఏ విషయం క్యాబినెట్‌లో చర్చకు వచ్చినా, అందరిలో ఒకే లక్ష్యం, డెవలప్మెంట్, డెవలప్మెంట్, డెవలప్మెంట్. అందుకే ప్రధానమంత్రి ఎప్పుడూ అంటారు "డెవలప్మెంట్ కావాలంటే రిఫార్మ్స్ తప్పనిసరి. రిఫార్మ్స్ లేకుండా ఏ మంత్రిత్వ కార్యక్రమం జరగకూడదు, ఏ బిల్లు పాస్ కాకూడదు." రిఫార్మ్స్ లేకుండా క్యాబినెట్‌లో ఏ అంశాన్నైనా అప్రూవ్ చేయరాదన్న విధంగా బడ్జెట్‌లోనే ప్రత్యేక నిబంధనను ప్రవేశపెట్టారు. బడ్జెట్‌కు సంబంధించినా, లేదా క్యాబినెట్ ఆమోదం కోరే ఏ అంశమైనా తీసుకువచ్చినా అందులో రిఫార్మ్స్ అంశం తప్పనిసరిగా ఉండాలి. అంటే, క్యాబినెట్ ముందుకు వచ్చే ప్రతి అంశంలో ఏ రిఫార్మ్స్ ప్రతిపాదిస్తున్నామో స్పష్టంగా వివరించాలి. రిఫార్మ్స్ లేకుండా ఏ నిర్ణయం తీసుకోవద్దనే స్పష్టమైన దిశానిర్దేశం మనం ఈరోజు పాటిస్తున్నాం. అందుకే ప్రధానమంత్రి గారు చెప్పారు.

# 16న రాష్ట్ర మంత్రిమండలి సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

అంచనాలు పెంచడం, మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనులు, తమ్మిడిహట్టి వద్ద నిర్మాణం, సమ్మక్కసారక్క ఆనకట్ట, దేవాదుల ఆరో ప్యాకేజీ వంటి అంశాలపై మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది. కేబినెట్‌కు సమర్పించే అవకాశాలపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో చర్చించారు. గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం, టీఫైబర్ విస్తరణ, మూసీ ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీకి సంబంధించిన అంశాలు మంత్రివర్గ భేటీలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 16న సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. ఇందులో మెట్రో రైలు ప్రాజెక్టు స్వాధీనం, ధాన్యం సేకరమ, ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పునఃప్రారంభం తదితర కీలకాంశాలపై చర్చింది నిర్ణయం తీసుకనే అవకాశం ఉంది. మంత్రిమండలి సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి శనివారం తన కార్యాలయ అధికారిలతో సమావేశం అయ్యారు. మెట్రో రైలు ప్రాజెక్టు నిర్వహణ సంస్థ ఆ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నందున దాన్ని ప్రభుత్వ పరిధిలోకి తేవడం, గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం, టీఫైబర్ విస్తరణ, మూసీ ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీకి సంబంధించిన అంశాలను మంత్రివర్గ సమావేశం ఎజెండాలో చేర్చారు. వివిధ ప్రాజెక్టుల అంచనాలు పెంచడం, మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులు, తుమ్మిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం, సమ్మక్కసారక్క ఆనకట్ట, దేవాదుల ఆరో ప్యాకేజీ వంటి అంశాలపైనా చర్చించే అవకాశం ఉంది. మంత్రిమండలికి నివేదించాల్సిన అంశాలను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో చర్చించి ఖరారు చేశారు. మెట్రో మొదటి దశను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అంశంపై ఈ నెల 16న జరిగే రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో చర్చించి ఆమోదించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఈ మేరకు అధికారులు క్యాబినెట్ నోట్‌ను సిద్ధం చేస్తున్నారు. మెట్రోకి ఉన్న రూ.13 వేల కోట్ల రుణాల బదిలీ, రూ. 2 వేల కోట్ల ఈక్విటీ చెల్లింపునకు సర్కారు ముందుకొచ్చింది. ఈ ప్రక్రియను తదుపరి దశకు తీసుకెళ్లేందుకు న్యాయ, ఆర్థిక పరమైన అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. వీటితో పాటు చట్టబద్ధంగా సాగాల్సిన ప్రక్రియపై సర్కారు దృష్టి పెట్టింది. ఆర్థికపరమైన అంశాలతో ముడిపడిన అంశం కావడంతో మంత్రిమండలి ఆమోదం తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. క్యాబినెట్‌లో ఆమోదించాక ఈ విషయాన్ని తెలుపుతూ కేంద్రానికి మరోసారి రాష్ట్ర ప్రభుత్వం లేఖను పంపనుంది. మంత్రిమండలిలో మెట్రో రైలు నిర్వహణ, ఇతర ముఖ్యమైన అంశాలు చర్చకొచ్చే అవకాశం ఉంది.

## పోరు ఆగదు



శనివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు మద్దతుగా చేపడుతున్న నిరసనకు సపోర్టు ఇవ్వాలని కిషన్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ... రాష్ట్ర బంద్‌కు బీజేపీ మద్దతు కోరుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశానని చెప్పారు. పార్టీతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని అన్నారు. ఈ నిరసనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే తాజాగా రాష్ట్రంలోని బీసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా "తెలంగాణ బీసీ జేఏసీ" ఏర్పాటు అయింది. ఈ మేరకు హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. బీసీ జేఏసీ చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా వీజీ నారగోనిలు నియమితులయ్యారు. బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్, కో చైర్మన్‌లుగా రాజారాం యాదవ్, దాసు సురేశ్, మీడియా కోఆర్డినేటర్ గుజ్జ క్రిష్ణ నియమితులయ్యారు. అలాగే ఈ నెల 14న తలపెట్టిన బీసీ సంఘాల బంద్ ను ఈ నెల 18కి వాయిదా వేశారు.

ఇక, తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో తాము జోక్యం చేసుకోలేదని... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు వీలుగా జారీ చేసిన జీవో నంబర్ 9పై స్టే విధించినట్టుగా హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచించింది. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందకు సాగాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు సంబంధించిన మంత్రులు, ఉన్నతాధికారులు, న్యాయ నిపుణులతో సీఎం రేవంత్ రెడ్డి అన్ని అంశాలను చర్చించిన తర్వాత సుప్రీంను ఆశ్రయించాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

## మాటల యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

(5 సంవత్సరాలు), సేవా షరతులను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించేలా మార్పులు జరిగాయి. స్వయం ప్రతిపత్తితో నిర్వహించే ఆర్టీఐ కమిషనర్లు కేంద్రం ఒత్తిడిలకు తల్లోగే పరిస్థితి ఏర్పడింది. కేంద్ర సమాచారం కమిషన్ ప్రస్తుతం 11 పోస్టులకు బదులుగా కేవలం ఇద్దరు కమిషనర్లతోనే పనిచేస్తోంది. 2025 సెప్టెంబర్ తర్వాత చీఫ్ కమిషనర్ పదవి కూడా ఖాళీగా ఉంటుంది. ఇంతకంటే దుర్మార్గం లేదు. కేంద్రంలోని ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వ అవినీతిని బహిర్గతం చేసే వ్యక్తులు రక్షణ లేకుండా దాడులు, వేధింపులకు గురవుతున్నారు. 2019 సవరణలను రద్దు చేసి కమిషన్ల స్వతంత్రతను పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర కమిషన్లలో ఖాళీలను తక్షణమే పారదర్శకంగా భర్తీ చేయాలి. కమిషన్ల పనితీరుపై నిర్దిష్ట ప్రమాణాలు, ప్రజా నివేదికలు తప్పనిసరి చేయాలి' అని డిమాండ్ చేశారు.



## సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్

- తాగి నడపొద్దు అని హెచ్చరించిన ఆగని మందుబాబులు ఆగడాలు
- పట్టుబడ్డ 534 మంది మందుబాబులు

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. శనివారం రాత్రి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 16 పిఎస్ లిమిట్స్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 534 మంది మద్యం సేవించిన వారు చిక్కారు. ఇందులో 435 టూ వీలర్స్, 18 త్రీ వీలర్స్, 79 ఫోర్ వీలర్స్, 2 హెవీ వెహికల్స్ ను పోలీసులు సీజ్ చేశారు. తాగి వాహనాలు నడిపే వాళ్లని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమై ఇతరుల ప్రాణాలు తీస్తే వారిపై భారతీయ న్యాయ సంహిత 2023 చట్టం, 105 సెక్షన్ కింద గరిష్ఠంగా 10 ఏండ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించనున్నట్లు పోలీసులు హెచ్చరించారు.

**CYBERABAD TRAFFIC POLICE WEEKEND SPECIAL DRIVE- DD CASES**

PS WISE BOOKED CASES

| PS NAME | NO OF CASES |
|---|---|
| Madhapur Tr PS | 28 |
| Rajendra Nagar Tr PS | 47 |
| Shamshabad Tr PS | 49 |
| Gachibowli Tr PS | 27 |
| Shadnagar Tr PS | 40 |
| Chevella Tr PS | 44 |
| Narsingi Tr PS | 18 |
| Raidurgam Tr PS | 19 |
| Miyapur Tr PS | 28 |
| Kukatpally Tr PS | 18 |
| Balanagar Tr PS | 31 |
| Jeedimetla Tr PS | 32 |
| Alwal Tr PS | 20 |
| KPHB Tr PS | 50 |
| Medchal Tr PS | 50 |
| RC Puram Tr PS | 33 |
| Total | 534 |

| Wheeler type | No of cases booked |
|---|---|
| 2 Wheeler | 435 |
| 3 Wheeler | 18 |
| 4 Wheeler | 79 |
| Heavy vehicle | 02 |
| Total | 534 |

Age Based

| Age | No of cases |
|---|---|
| <18 | 00 |
| 18-20 | 06 |
| 21-30 | 230 |
| 31-40 | 182 |
| 41-50 | 89 |
| 51- 60 | 20 |
| 61 Above | 07 |
| Total | 534 |

| BAC Count | No of cases booked |
|---|---|
| < 50 | 102 |
| 51-100 | 196 |
| 101-150 | 113 |
| 151-200 | 67 |
| 201-300 | 34 |
| 301-500 Above | 22 |
| Total | 534 |

# కారు కావాలా.. బుల్డోజర్ కావాలా?

(మొదటిపేజీ తరువాయి)

కేటీఆర్ మాట్లాడారు. 'జూబ్లీహిల్స్ ప్రజలు 'కారు' కావాలా, 'బుల్డోజర్' కావాలా నిర్ణయించుకోవాలి. జూబ్లీహిల్స్ ఎన్నికతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉన్నది. కాంగ్రెస్ గెలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని చెప్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు, ప్రస్తుతం రాష్ట్రంలో రెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్నది ఎవరో చెప్పాలి. ఎన్నికల్లో బుద్ధి చెబితేనే కాంగ్రెస్ పార్టీకి సోయి వస్తది. రెండు సంవత్సరాల్లో సంపాదించిన మొత్తం అవినీతి సొమ్మును జూబ్లీహిల్స్‌లో ఖర్చుపెడతారు. కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ. 10,000 ఇస్తారు.' అని కేటీఆర్ అన్నారు. బీజేపీ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి పనికిరాని పార్టీ అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే మోరీలో వేసినట్లే అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరం తిరిగి అభివృద్ధి గాడిన పడాలంటే కేసీఆర్ తిరిగి రావాల్సిందేనని, అది జూబ్లీహిల్స్ నుంచే మొదలు కావాలని పిలుపునిచ్చారు కేటీఆర్. ఇచ్చిన హామీల అమలులో చేసిన మోసం గురించి కాంగ్రెస్ పార్టీపై ప్రజలు కోపంగా ఉన్నారని ఆ పార్టీ అర్థం చేసుకుంటదని కేటీఅర అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతేనే నెలకు 4 వేల పెన్షన్లు వస్తాయని, ఎన్నికల కోసం చెప్పిన హామీలన్నీ అమలు అవుతాయని చెప్పారు. ఒకవేళ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, ప్రజలను తాము మోసం చేసినా మిమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు అని కాంగ్రెస్ పార్టీ భావిస్తుందన్నారు కేటీఆర్.

'ఆరు గ్యారంటీలు చెప్పి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసింది. అన్ని అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కింది. ఈ రెండు సంవత్సరాలుగా ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేకపోయింది. ఒక్క ఇల్లు కట్టలేదు, ఒక్క ఇటుక పెట్టలేదు, కానీ రెండు లక్షల 80 వేల కోట్ల రూపాయల అప్పుల్ని మాత్రం చేసింది. గరీబోళ్ల ఇండ్లు ఎక్కడుంటే అక్కడికి బుల్డోజర్లు పంపించి, హైదరాబాద్‌లో ఇళ్లు కూలగొట్టిస్తున్నాడు రేవంత్ రెడ్డి.' అని కేటీఆర్ అన్నారు.


కోర్టులు, చట్టబద్ధమైన డాక్యుమెంట్లు ఇవేవీ చూడకుండా పేదవాళ్ళ ఇండ్లపైన బుల్డోజర్లను రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నడిపిస్తుందని కేటీఆర్ విమర్శించారు. అన్నీ తెలిసి కూడా బీసీ రిజర్వేషన్ల అంశంలో రేవంత్ రెడ్డి మోసం చేశారన్నారు. పార్లమెంట్‌లో చేయాల్సిన చట్టం అసెంబ్లీలో చేస్తే చెల్లదని తెలుసు అని, ఇచ్చిన జీవోను కోర్టు కొట్టేస్తుందని కూడా తెలిసి మరీ బీసీ రిజర్వేషన్ల పేరుతో నాటకాలు ఆడి మోసం చేశారని విమర్శించారు.



అజారుద్దీన్‌కు ఇస్తామని చెప్పిన ఎమ్మెల్సీ కూడా ఆయనకు రాదని తెలుసు, కానీ ఆయనను కూడా రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు కేటీఆర్. ముస్లింలకు ఇస్తామని చెప్పిన ఖబరస్థాన్ విషయంలో కూడా మోసం చేశారన్నారు. తెలిసి మరీ ప్రజలను మోసం చేయడమే రేవంత్ రెడ్డి నైజమని పేర్కొన్నారు. ఆయన నిజాయితీగా చెబుతూ మరీ మోసం చేస్తున్నాడని, గతంలోనే 'మోసం చేసే వాళ్ళనే ప్రజలు నమ్ముతారు' అని రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పినట్టుగా గుర్తు చేశారు. రెండు సంవత్సరాల్లో ఒక్కటంటే ఒక్క పని చేయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని, రెండు సంవత్సరాలు కేవలం కేసీఆర్ నామ జపం చేసి కాలం గడిపేశారన్నారు.

## మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శ

**దేవకమ్మ ఘన నివాళి**



**చిన్నగూడూర్, విశాలభారతి:**

డోర్నకల్ నియోజకవర్గ చిన్నగూడూర్ గ్రామంలో గాడిపల్లి దేవకమ్మ పార్థీవ దేహానికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె మాట్లాడుతూ — "దేవకమ్మ కుటుంబానికి మాత్రమే కాదు, సమాజానికి స్ఫూర్తి. ప్రజాసేవలో ఉన్నత స్థాయిలో నిలిచిన తమ కుమారులు మధు, శ్రీహరి, యాదగిరి, శేఖర్ వెనుక ఉన్న శక్తి ఆమె మాతృప్రేరణే. తల్లి చూపిన విలువలు తరతరాలకు మార్గదర్శకాలు అవుతాయి" అన్నారు. ఆమె కుటుంబానికి ధైర్యం నింపుతూ, దేవకమ్మ సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, బోడ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవం

**పెద్ద అంబర్పేట్ , విశాలభారతి:**

హయత్‌నగర్ ప్రాంతంలో ఎంతో అంగరంగ వైభవంగా జరుగుతున్న శ్రీ బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవం భక్తి శ్రద్ధలతో సాగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మధుయాష్కీ గౌడ్ , ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఏవి ఎన్ రెడ్డి, ఆర్ అండ్ బి చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భజనలతో, నృత్యాలతో భక్తి భావాన్ని వ్యక్తపరచారు.



ఆలయ ప్రాంగణం పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించబడింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ హయత్ నగర్ గ్రామ బొడ్రాయి ఉత్సవం హయత్‌నగర్ ప్రజల ఆధ్యాత్మిక ఐక్యతకు, భక్తి భావాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఉత్సవంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయడం జరుగుతుందని అన్నారు.

## బీఎస్పీ రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్, అధ్యక్షుల, కన్వీనర్‌ల నియామకం

**పెద్ద అంబర్ పేట్ , విశాలభారతి:**

బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రంగా రెడ్డి జిల్లా నూతన ఇంచార్జ్, అధ్యక్షులు, కన్వీనర్‌ల నియామకాలు ఆదివారం రోజు ఎల్.బి.నగర్‌లోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో నిర్వహించబడ్డాయి. జిల్లా ఉపాధ్యక్షులు అనంతరాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ అన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి బలగాల విస్తరణపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో కొత్తగా నియమితులైన వారు బీఎస్పీ జిల్లా ఇంచార్జ్ గా పల్లాటి రాములు, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గా దొడ్డి శ్రీనివాస్, బీఎస్పీ జిల్లా మహిళా ఇంచార్జ్ గా కంబాలపల్లి శాంత, బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ గా వావిలాల ఇందుమతి, బీఎస్పీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గా యంజాల ప్రహ్లాద్ లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిత్రం కృష్ణ, గ్యార మల్లేష్‌తోపాటు ఏడు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, పాల్గొని కొత్త పదాధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.



# గచ్చిబౌలి ఏఐజి ఆసుపత్రి లో దారుణం



- లివర్ ట్రాన్స్ ప్లాంట్ కోసం వచ్చిన వ్యక్తి మృతి
- 45 రోజుల క్రితం ఏఐజిలో చేరిక

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

వైద్యుల నిర్లక్ష్యంగానే లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం వచ్చిన వ్యక్తి మృతి చెందాడంటూ ఆసుపత్రి ముందు కుటుంబ సభ్యులతోపాటు బంధువులు ఆందోళనకు దిగారు.దీంతో స్థానికంగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ ఘటన హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. దీంతో రాయదుర్గం పోలీసులు అక్కడికి చేరుకుని.. పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కుత్బుల్లాపూర్‌లోని గాంధీ నగర్‌కు చెందిన మురళీధర్ (40) లివర్ సమస్యతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో జీవన్‌దాన్‌లో లివర్ మార్పిడి కోసం నెలన్నర క్రితం ఏఐజీ ఆసుపత్రిలో చేరారు.మురళీధర్ వయస్సు 40 ఏళ్లు అయితే.. 60 ఏళ్లుగా ఆసుపత్రి సిబ్బంది నమోదు చేశారని అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో లివర్ డోనర్స్ ఎవరూ ముందుకు రాలేదని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు మండిపడుతున్నారు. దాంతో మురళీధర్ భార్య ముందుకు వచ్చి.. భర్తకు లివర్ ఇవ్వడంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు.ఈ ఆపరేషన్ కోసం నిన్న అంటే.. శనివారం రూ. 14 లక్షలను అతడి కుటుంబ సభ్యులు చెల్లించారు. అనంతరం మురళీధర్ మృతదేహాన్ని తీసుకుని వెళ్లాలంటూ అతడి కుటుంబ సభ్యులకు ఏఐజీ ఆసుపత్రి సిబ్బంది వెల్లడించారు. నగదు చెల్లించిన తర్వాత ఈ ఈ విషయం వెల్లడించడంతో ఆసుపత్రి సిబ్బందిపై అతడి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.గత 45 రోజుల నుంచి ఇప్పటి వరకు ఆ ఆపరేషన్ నిమిత్తం రూ. 85 లక్షలు బిల్లు రూపంలో ఆసుపత్రికి చెల్లించామని వారు తెలిపారు.ఈ ఆపరేషన్ కోసం ఉన్న ఒక ఇల్లు సైతం విక్రయించి.. నగదు చెల్లించినట్లు మృతుని బంధువులు వెల్లడించారు. కాగా తమకు న్యాయం చేయాలంటూ..మురళీధర్ కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఆ క్రమంలో పోలీసులు రంగంలోకి దిగారు.

# జర్నలిస్టు రోశయ్యను పరామర్శించిన బానోత్ దేవేందర్

**మహబూబాబాద్, విశాలభారతి:**

వెన్నునొప్పి తీవ్రతతో బాధపడుతూ మహబూబాబాద్ జిల్లా ఏరియా ఆసుపత్రిలో ఆదివారం అడ్మిట్ అయి చికిత్స పొందుతున్న N6 న్యూస్ ఛానల్ మహబూబాబాద్ జిల్లా స్టాప్ విలేఖరి రోశయ్యను పిడియస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ హాస్పిటల్ కి స్వయంగా వెళ్లి పరామర్శించారు. రోశయ్య ఆరోగ్య స్థితి గురించి ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ఆయనకు అందిస్తున్న చికిత్సపై వివరాలు తెలుసుకున్నారు. దేవేందర్ మాట్లాడుతూ... "రోశయ్య ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పట్ల కట్టుబాటుగా వ్యవహరించే నిజాయితీ గల పాత్రికేయుడు. ఆయన ఆరోగ్యవంతంగా తిరిగి ప్రజల మధ్యకు రావాలి" అని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రోశయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ మీరు ధైర్యంగా ఉండాలని అన్నగారు త్వరగా కోలుకుంటారన్నారు. దేవేందర్ ఆయన చేతుల మీదుగా పండ్లు, ఆరోగ్యవర్ధక పానకాలు, అందజేశారు. తెలంగాణ ఉద్యమకారుడు పేర్ల గణేష్, జర్నలిస్టు కమటం నాగేశ్వరావు, ప్రవీణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మిరియాల శ్రీనివాస్ పరామర్శించారు.



# ముదిరాజ్‌ల అలయ్ బలయ్

- కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి
- మల్గాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

**సికింద్రాబాద్, విశాలభారతి:**

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి నామాలగుండు బీఎన్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సికింద్రాబాద్ ముదిరాజ్‌ల సంక్షేమ సంఘం సభ్యులు సంజీవ్ ముదిరాజ్, యాదగిరి ముదిరాజ్, సతీష్ రాజ్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించడమైనది. మహిళల ఆటపాటలు. బతుకమ్మ కోలాటాలు బోనాల జాతర తలపించే విధంగా అలయ్ బలయ్ కార్యక్రమం అద్భుతంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి , మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కన్నుల పండుగగా జరిగిన ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి, ఈటెల రాజేందర్‌లు వేరు వేరుగా మాట్లాడుతూ ముదిరాజులకు పూర్తిగా అండగా ఉంటామని. వారికి అన్ని రంగాలలో అవకాశాలు కల్పిస్తామని అన్నారు. అందరూ ఐక్యమత్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని వారు పిలుపునిచ్చారు. అన్నదమ్ముల సోదర భావంతో గ్రామాల్లో మంచి వాతావరణంలో ముదిరాజులు సాహసపెతమైన జీవితం గడిపారని వారు వెనుకబడిన తరగతులు అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారని కిషన్ రెడ్డి,ఈటల రాజేందర్‌లు అన్నారు . వారికి దక్కవలసిన చట్టసభల , స్థానిక సంస్థల రాజకీయ గౌరవం తప్పకుండా దక్కే విధంగా మేము అండగా ఉంటామని అన్నారు. ధన బలం జనబలం గుండె ధైర్యంతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ ముదిరాజ్, నాయకులు భరత్ గౌడ్ , శంకర్ ముదిరాజ్ , మేకల సారంగపాణి, గణేష్, కనకట్ల హరి, మేకల కీర్తి హర్ష కిరణ్, నీలం శ్రీనివాస్, విజయ ముదిరాజ్, హరిదాస్ పిట్ల, రాజేష్ ముదిరాజ్, నేతాజీ, నరేష్ ముదిరాజ్, కుమారస్వామి, సురేష్ ముదిరాజ్ ,తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలి

- అప్పులు తీర్చలేక, వడ్డీలు కట్టలేక నానా ఇబ్బందులు
- పెండింగ్ బిల్లులు చెల్లించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలి
- గుగులోతు రాంలాల్ నాయక్ మాజీ సర్పంచ్



**మహబూబాబాద్, విశాలభారతి:**

మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్ ల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కురవి మాజీ సర్పంచ్ గుగులోతు రాంలాల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ ప్రజా సేవ చేసే అవకాశం వచ్చిందని మురిసిపోయి ఎన్నుకున్న ప్రజల కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్పంచ్లు, ఎంపిటిసిలు అప్పులు తీసుకొచ్చి గ్రామాలు, తండాలలో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. రూ. లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేసిన బిల్లులు పెండింగ్లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం మారిపోవడం, పదవులు ముగిసిపోయి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్న బిల్లులు చెల్లింపు సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో మాజీ సర్పంచ్లు, ఎంపిటిసిలు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బిల్లులు రాక, అభివృద్ధి పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేక అనేక మంది మాజీ సర్పంచ్, ఎంపిటిసిలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పెండింగ్ బిల్లులు అందిస్తామని ప్రగ్భలాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హామీని విస్మరించిందని ఆరోపించారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని చెప్తూనే ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# జర్నలిజంలో గోల్డెన్ నంది అవార్డు అందుకున్న ఫోకస్ టీవీ చెర్మన్ తరుణ్

**హైదరాబాద్, విశాల భారతి**

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రముఖ జర్నలిస్ట్ ఫోకస్ టీవీ & నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ దినపత్రిక చెర్మన్ & చీఫ్ ఎడిటర్ మాంకాళి తరుణ్ కు అరుదైన గౌరవం లభించింది.మాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ వారు నిర్వహించిన అక్టోబర్ 10 తేదీ శుక్రవారం నాడు హైదరాబాద్ నాంపల్లి లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన సౌత్ ఇండియా అవార్డ్స్ లో మాంకాళి తరుణ్ కు జర్నలిజం కేటా గిరిలో యంగెస్ట్ చెర్మన్ గా 2025 గోల్డెన్ నంది అవార్డు అందుకున్నారు, సామాజిక రంగంలో, మీడియా రంగంలో విశేష అనుభవం కలిగి సమాజ సేవకు కృషిచేసిన వారిని ఎంపిక చేయగా మీడియా రంగంలో ఉత్తమ జర్నలిస్టుగా ఎన్నికై నంది అవార్డు అందుకున్నారు.




ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ చేతులమీదుగా అవార్డు అందుకోవడంతో తోటి జర్నలిస్టులతో పాటు, ఫోకస్ న్యూస్ పత్రిక జర్నలిస్టులు, ఫోకస్ టీవీ జర్నలిస్టులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ 11సంవత్సరాలుగా నేను జర్నలిజం రంగంలో రానిస్తూ ఇటు ప్రజలకి ప్రభుత్వానికి మధ్య వారదిగ పని చేస్తూ సమాజ సేవ చేస్తున్నందుకు గర్విస్తున్నాను అని అన్నారు నన్ను గుర్తించి గోల్డెన్ నందిని అవార్డు అందజేసిన ఆ యొక్క సంస్థ కు మరియు ప్రజా ప్రతినిధులకు మరియు నాకు సహకరించిన ప్రతి ఒకరికి ధన్యవాదాలు తెలిజేశారు.




# ఉద్యమ కారుల ఐక్యవేదిక మండల కమిటీ ఎన్నిక

**తిరుమలగిరి, విశాలభారతి :**



తిరుమలగిరి మండల ఉద్యమకారుల ఐక్యవేదిక జేఏసీ కమిటీనిఆదివారం నాడు మున్సిపల్ పరిధిలోని పద్మశాలి భవన్ లో సభ్యులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా పులిమామిడి వెంకన్న ,ప్రధాన కార్యదర్శిగా వంగరి బ్రహ్మం, ఉపాధ్యక్షులుగా ఎర్రబెల్లి వెంకన్న ,సహాయ కార్యదర్శిగా కందుకూరి మహేష్, కోశాధికారిగా ఏపూరి నరేష్, గౌరవాధ్యక్షులుగా దుస్సా రామ్మూర్తి,తో పాటు మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు, ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ చాంద్ పాషా, రాష్ట్ర కమిటీ నాయకులు భైరబోయిన వెంకటేశ్వర్లు, ఎండి రహమాన్ అలీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

# మౌలిక వసతులు కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నాం



**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్ సిఐ కాలనీలోనీ కృష్ణ సాయి అపార్ట్మెంట్స్ లో వాటర్ హెడ్ ఇండియా సంస్థ వారి సౌజన్యంతో రూ.3.5 లక్షలతో చేపట్టిన బోర్ పునరుద్ధరణ పనులు పూర్తయిన సందర్భంగా వాటర్ హెడ్ ఇండియా సంస్థ సభ్యులు, అపార్ట్మెంట్స్ అసోసియేషన్ సభ్యులతో కలసి ముఖ్య అతిథిగా మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. వాటర్ హెడ్ ఇండియా సంస్థ వారి సౌజన్యంతో రూ. 3.5లక్షల తో చేపట్టిన బోర్ పునరుద్ధరణ పనులు, ఇంకుడు గుంతల పనులు పూర్తయిన సందర్భంగా వాటర్ హెడ్ ఇండియా సంస్థ సభ్యులు, అపార్ట్మెంట్స్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు.అపార్ట్మెంట్స్ లో బోరు పునరుద్ధరణ పనులు ఇంకుడు గుంతలను నిర్మించడం చాలా అభినందించదగ్గ విషయం అని,వాటర్ హెడ్ ఇండియా సంస్థ వారి సేవలు అమోఘం అని, కాలనీలలో సామాజిక దృక్పథంతో సమాజ సేవ కై వారు చేస్తున్న సేవలు చాలా గొప్పవి అని కార్పొరేటర్ కొనియాడారు.కృష్ణ సాయి అపార్ట్మెంట్స్ వాసులకు బోర్ ఎంతగానో ఉపయోగపడుతుందని అదేవిధంగా సమాజ హితం ప్రతి ఒక్కరు సామాజిక సేవలు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కృష్ణ సాయి అపార్ట్మెంట్ అసోసియేషన్ వాసులు వాటర్ హెడ్ ఇండియా సంస్థ సభ్యులు విజయరేఖ,బాలు తదితరులు పాల్గొన్నారు.

# అపార్ట్మెంట్‌లో అగ్నిప్రమాదం



**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా మణికొండలోని బి ఆర్ సి అపార్ట్మెంట్ లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ఎలక్ట్రికల్ వైర్స్ డక్ యూనిట్ లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు ఈ మంటలను గమనించిన అపార్ట్మెంట్ వాసులు కిందకు పరుగులు తీయడం జరిగింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి మరియు పోలీసులకు సమాచారం అందించడం జరిగింది ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది. 4 ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను ఆపివేయడం జరిగింది వెంటనే విద్యుత్ అధికారులు అప్రమత్తమై ఈ యొక్క అపార్ట్మెంట్ కు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరిగింది. ఈ అగ్నిప్రమాదం వలన ఎలక్ట్రికల్ డక్ యూనిట్ లో విద్యుత్ వైర్లు పూర్తిగా కాలి పోవడంతో అపార్ట్మెంట్లోని 19 అంతస్తుల వరకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా. మంటలను చూసి కిందకు పరుగులు తీసే క్రమంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడం జరిగింది.

# రిమాండ్ ఖైదీ మల్లేష్ మృతి

**దేవరుప్పల, విశాలభారతి:**

మండలం,సింగరాజుపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ నిన్న సబ్ జైలులో బ్లీచింగ్ పౌండర్ తాగి ఆత్మహత్య యత్నం,గుట్టుచప్పుడు కాకుండా చికిత్స కోసం జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన జైలు అధికారులు,పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ కు తరలింపు, చికిత్స పొందుతూ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో మల్లేష్ గత రాత్రి (శనివారం) మృతి, జైలు అధికారుల నిర్లక్ష్యమే నా భర్త మృతికి కారణం అంటూ సబ్ జైలు ముందు మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్థుల ఆందోళన, జనగామ డీసీపీకి పిర్యాదు చేసిన భార్య వారాల హైమ.

# బాధిత కుటుంబానికి పరామర్శ

**దేవరుప్పల, విశాలభారతి:**

మండల కేంద్రంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన పోతరాజు దానయ్య (58) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మరణించగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు వారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసిన బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు ఏల సుందర్. ఈ కార్యక్రమంలో వారి వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జోగు సోమనరసయ్య చింత యాదగిరి భాషిపాక అబ్బయ్య జోగు ఐలుమల్లు చింత ఇస్తారి చింత సోమనరసయ్య ఉప్పుల సోమయ్య జోగు రామచంద్రు పాత్రికేయులు భాషిపాక ఎల్లేష్ ఉప్పుల పరుశురాములు జోగు సుధాకర్ జోగు నవీన్ ఉప్పుల మహేష్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# పార్థివదేహానికి నివాళులు

**దేవరుప్పల, విశాలభారతి:**

మండల కేంద్రంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన పోతరాజు దానయ్య (58) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మరణించగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు వారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసిన బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు ఏల సుందర్. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు లొడంగి వెంకటేశ్వర్లు నాయకులు తోటకూరి కృష్ణయ్య జోగు సోమనరసయ్య చింత యాదగిరి భాషిపాక అబ్బయ్య ఆలకుంట్ల వెంకన్న జోగు ఐలుమల్లు చింత ఇస్తారి చింత సోమనరసయ్య చింత యాకయ్య ఉప్పుల సోమయ్య జోగు రామచంద్రు జోగు రవి పాత్రికేయులు భాషిపాక ఎల్లేష్ ఉప్పుల పరుశురాములు ఉప్పుల సంజీవ్ జోగు సుధాకర్ జోగు మధు జోగు నవీన్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని పసుమాముల బస్తీ దావఖాన వైద్యాధికారి శృతి అన్నారు. రాష్ట్రంలోకి పోలియో తిరిగి రాకుండా చూసేందుకు అక్టోబర్ 12న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో పాటు ఆరు జిల్లాల్లో ప్రత్యేక పల్స్ పోలియో టీకా కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా పెద్దఅంబర్ పేట మున్సిపాలిటీ పసుమాముల అంగన్వాడి కేంద్రంలో పోలియో చుక్కల పంపిణీని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శృతి మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేయిస్తే భవిష్యత్తులో అంగవైకల్యం రాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కొరివి పద్మ, స్టాఫ్ నర్స్ సంధ్యారాణి, అంగన్వాడి టీచర్ డి రాణి, ఆశా వర్కర్ డి సబిత, సహాయకులు భార్గవి, గంగ తదితరులు ఉన్నారు.

**నిండు జీవితానికి రెండు చుక్కలు**

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** రెండు పోలియో చుక్కలతో చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం చిన్నారులకు పోలియో రహిత భవిష్యత్తును అందిద్దామని మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని జయప్రకాశ్ నారాయణ నగర్ కాలనీలోనీ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన "పల్స్ పోలియో" కార్యక్రమంలో స్థానిక నాయకులు కాలనీ వాసులతో కలసి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుంచి ఐదేళ్లు లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తల్లిదండ్రులు తప్పక వేయించాలని,పిల్లలకు పోలియో డ్రాప్స్ వేయటం వల్ల అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చని, పోలియో రహిత సమాజమే లక్ష్యంగా నేడు పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు.ఈ అవకాశాన్ని డివిజన్లోని ప్రతి ఒక్క తల్లిదండ్రులు ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మోహన్ రావు, శివ ముదిరాజ్, మహేశ్వర్ రెడ్డి, బసవేశ్వర్ రావు, ఆషా వర్కర్ సుజాత, సపోర్టింగ్ స్టాప్స్ అక్తర్ బేగం, సతీష్, ఈశ్వర్, వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

**ఎల్బీనగర్, విశాలభారతి:** పుట్టినప్పటి నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించుకోవాలని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా హస్తినాపురం డివిజన్ నందనవనం బస్తీ దావఖానలో పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలియో నివారణ కోసం ప్రతి ఒక్కరూ తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మమత,జనార్ధన్,నరసింహ,గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పిచేర్యాగడి తండాలో పల్స్ పోలియో కార్యక్రమం**





**జహీరాబాద్, విశాలభారతి:** బదేశవ్యాప్తంగా జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా, ఆదివారం కోహిర్ మండలంలోని పిచేర్యాగడి తండాలో అంగన్వాడీ కేంద్రం వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో కోహిర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ..ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో రహిత భారతదేశం నిర్మించడమే మన అందరి లక్ష్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు,ఆశ వర్కర్ లు తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
# సినిమా
హైదరాబాద్
సోమవారం
13 అక్టోబర్ 2025
CINEMA

## ఆంధ్రా కింగ్ తాలూకా
# టీజర్ విడుదల!

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా దర్శకుడు పి. మహేష్ బాబు (మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ఫేమ్) దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్-మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ టీజర్ చూస్తుంటే ఈ చిత్రంలో రామ్.. ఒక సూపర్ స్టార్‌కి వీరాభిమానిగా కనిపించనున్నారు. కన్నడ స్టార్ ఉపేంద్ర గారు పోషించిన 'ఆంధ్రా కింగ్' పాత్రకు రామ్ ఎంతటి డైహార్డ్ ఫ్యాన్ అనే అంశాన్ని టీజర్ హైలైట్ చేసింది. రామ్ పోతినేని ఎనర్జీ, మాస్ డైలాగ్స్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ వంటి ప్రముఖ నటులు ఇతర ముఖ్యపాత్రల్లో కనిపిస్తున్నారు.



# ఫౌజీ గురించి ఆ వార్త నిజమేనా

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ'చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే! మైత్రీ మూవీస్ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో ఇమాన్వీ కథానాయికగా పరిచయమవుతుంది. బిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం గురించి ఎలాంటి వివరాలు బయటకు రానివ్వకుండా మేకర్స్ చిత్రీకరణ చేస్తున్నారు. అత్యంత గోప్యంగా ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమా పనులు శరవేగంగా జరుగుతున్నాయి.1940 నేపథ్యంలో జరిగే హిస్టారికల్ రొమాంటిక్ డ్రామాగా 'ఫౌజీ' తెరెకెక్కబోతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించబోతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే 60u శాతం షూటింగ్ పూర్తయినట్టు తెలిసింది. ఇంకా ప్రభాస్‌కు 35 రోజుల షూటింగ్ పోర్షన్ మిగిలి ఉంది. అయితే ఈ సినిమా తర్వాత 'ఫౌజీ ప్రీక్వెల్' కూడా ఉంటుందంటున్నారు. అంతా అనుకూలిస్తే వచ్చే ఏడాది ఆగస్టు నెలలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి 'మైత్రీ మూవీస్' సంస్థ ప్రయత్నిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం. విశాల్ చంద్ర శేఖర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. దర్శకుడు హనూ రాఘవపూడి సున్నితమైన భావోద్వేగాలను చిత్రీకరించడంలో సిద్ధహస్తుడు కావడంతో, చాలా కాలం తరువాత ప్రభాస్ నుంచి ప్రేమ కథ కావడంతో 'ఫౌజీ'పై అంచనాలు భారీగా ఉన్నాయి.



వ్యక్తిగతంగా నేను చాలా ఎమోషనల్ పర్సన్. గతంలో నాకో లవ్‌స్టోరీ ఉండేది. కొన్ని కారణాల వల్ల బ్రేకప్ అయ్యింది. ఆ సమయంలో మానసికంగా కుంగుబాటుకు గురయ్యా. ఆ తర్వాత నన్ను నేను మార్చుకున్నా' అని రాశి ఖన్నా అన్నారు. సినిమాలకు కొంత గ్యాప్ ఇచ్చిన ఆమె ఇప్పుడు వరస సినిమాలతో బిజీగా ఉంది. వచ్చేవారం సిద్దు జొన్నలగడ్డతో నటించిన 'తెలుసు కదా' రిలీజ్ అవుతోంది. మరోపక్క పవన్ కళ్యాణ్ తో 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా చేస్తోంది. ఈ సందర్భంగా కెరీర్ గురించి ఆమె చెప్పకొచ్చిన సంగతులివి... నేను పుస్తకాల పురుగుని. చదువులో టాపర్. ఇప్పుడు కూడా షూటింగ్‌లో ఖాళీ సమయం దొరికితే పుస్తకం తిరగేస్తుంటా. ప్రయాణాల్లోనూ నా టైంపాస్ పుస్తకాలే. చరిత్ర గురించి చదవడం ఆసక్తి. అది తెలుసుకునే హీరో కార్తీ ఓసారి మొఘలుల చరిత్రకి సంబంధించి పుస్తకం కానుకగా ఇచ్చాడు. బాలీవుడ్ హీరో విక్రాంత్ మాస్సే కూడా 'మిడ్‌నైట్ లైబ్రరీ' పుస్తకం గిఫ్ట్‌గా ఇచ్చాడు. 'ది ఫౌంటెన్ హెడ్', 'ది గర్ల్ హూ ప్లేడ్ విత్ ఫైర్' పుస్తకాలంటే చాలా ఇష్టం. మొదట్లో చాలా అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోయాయి. వాటిలో 'బాహుబలి' ఒకటి. అందులో తమన్నా పోషించిన అవంతిక పాత్ర కోసం ఆడిషన్ ఇచ్చాను. అయితే నా సుకుమారమైన ముఖం చూసి రాజమౌళిగారు ఆ పాత్రకు అందంతోపాటు, రఫ్‌లుక్ కూడా కావాలన్నారు. పైగా 'నా స్నేహితుడొకరు లవ్‌స్టోరీ చేస్తున్నారు. అక్కడకు వెళ్లు. ఆ కథ నీకు బాగా నచ్చుతుంది' అన్నారు. నేను వెళ్లి ఆ నిర్మాతను కలిసి కథ విన్నా. అలా "ఊహలు గుసగుసలాడే'తో టాలీవుడ్‌కు పరిచయమయ్యా. వ్యక్తిగతంగా నేను చాలా ఎమోషనల్ పర్సన్. గతంలో నాకో లవ్‌స్టోరీ ఉండేది. కొన్ని కారణాల వల్ల బ్రేకప్ అయ్యింది. ఆ సమయంలో మానసికంగా కుంగుబాటుకు గురయ్యా. ఆ తర్వాత నన్ను నేను మార్చుకున్నా. స్ట్రాంగ్‌గా నిలబడి, కెరీర్‌పై దృష్టి పెట్టా. కుటుంబసభ్యులు, స్నేహితులే నాకు అన్ని విధాలుగా సపోర్ట్ చేస్తుంటారు. వారే నా బలం.

# వాళ్ల కోసం అయితే కాదు



## ఇండియా టాప్ స్టార్‌గా
# అల్లు అర్జున్!



ఇండియన్ బాక్సాఫీస్‌ను కుదిపేసిన పుష్ప 2 ఓపెనింగ్స్ నుంచే రికార్డుల వర్షం కురిపించింది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ మొదటి రోజే రూ.290 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి సెన్సేషన్ క్రియేట్ చేసింది. పుష్ప 2 మొత్తం వసూళ్లు రూ.1800 కోట్లు దాటి, ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక అత్యంత పెద్ద హిట్‌గా నిలిచింది. ఈ ఘన విజయంతో అల్లు అర్జున్ రేంజ్ అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. "పుష్ప అంటే నేషనల్ అనుకుంటివా? ఇంటర్నేషనల్!" అన్న డైలాగ్ నిజంగా అల్లు అర్జున్ కెరీర్‌కు కూడా సరిపోతుంది..ఇప్పుడిప్పుడే గ్లోబల్ ఫాలోయింగ్ కూడా సంపాదించుకుంటున్న ఐకాన్ స్టార్‌కి మేకర్స్ నుంచి భారీ డిమాండ్ ఉంది. ఆయనతో సినిమాలు చేసేందుకు పోటీపడుతున్నారు. అయితే ఇప్పటికే పుష్ప 2 విజయంతో టాప్ లెవల్‌కి ఎక్కిన బన్నీ, తాజాగా రికార్డ్ రెమ్యునరేషన్‌తో వార్తల్లోకి ఎంటర్ అయ్యాడు. బాలీవుడ్ మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం, అల్లు అర్జున్ తమిళ డైరెక్టర్ అట్లీతో చేస్తున్న భారీ బడ్జెట్ సినిమాకి అక్షరాలా రూ.175 కోట్లు రెమ్యునరేషన్‌గా తీసుకుంటున్నాడు. ఇది ఇప్పటివరకు ఇండియన్ హీరోకి లభించిన అత్యధిక పారితోషికం. ఈ రికార్డ్ గతంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పేరుపైన ఉండగా, ఆయనకు కొన్ని సినిమాలకు రూ.150 కోట్లు రెమ్యునరేషన్‌గా ఇచ్చారు. ఇప్పుడు ఆ మార్క్‌ను బ్రేక్ చేసి, అల్లు అర్జున్ టాప్ స్పాట్‌ను ఆక్రమించాడు. ఈ వార్త తెలిసిన బన్నీ అభిమానులు ఉత్సాహంలో మునిగి తేలుతున్నారు. "ఇది కేవలం ఆరంభం మాత్రమే, రాబోయే సినిమాతో బన్నీ హాలీవుడ్ రేంజ్‌కి వెళ్తాడు" అంటూ కామెంట్లు చేస్తున్నారు. అట్లీ డైరెక్షన్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఒక సౌత్ హీరో, తానెంత టాలెంటెడ్ అనే విషయాన్ని పుష్ప 2తో దేశవ్యాప్తంగా నిరూపించుకున్నాడు. ఇప్పుడు దేశంలోని అత్యధిక రెమ్యునరేషన్ పొందే హీరోగా నిలిచిన బన్నీ పేరు ఇండియన్ సినిమా పటములో పెద్ద పెద్ద అక్షరాలతో చెక్కబడిందనే చెప్పాలి. "తగ్గేదేలే" అన్నది ఇప్పుడిక మాట కాదు.. మార్కెట్ స్టేట్‌మెంట్ అని నెటిజన్లు తెగ కామెంట్లు పెడుతున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.